

విద్యాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కె.గంగవరం: పేదవారందరికీ నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ అన్నారు. మండల పరిధిలోని దంగేరు ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చి నాణ్యమైన విద్య అందిస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. పేద విద్యార్థులు నూతన సాంకేతికత విద్యను అందిపుచ్చుకోవడానికి ప్రస్తుతం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యనారాయణ, హెచ్‌ఎం సీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


దంగేరులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న లక్ష్మణ్

మోడరన్ ఎస్ఎస్‌సీ బిట్ బ్యాంక్ ఆవిష్కరణ

రామచంద్రపురం: రామచంద్రపురం పరిసర గ్రామీణ ప్రాంతాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల్లో ఉపకరించే విధంగా ఏటా మోడరన్ విద్యా సంస్థలు రూపొందించే బిట్ బ్యాంక్ పుస్తకాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి విడుదల చేశారు. విద్యా సంస్థల ప్రాంగణంలో మోడరన్ అధినేత జీవీరావు అధ్యక్షతన శనివారం జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉపయోగపడేలా ఏటా 10వ తరగతి విద్యార్థులకు బిట్ బ్యాంకును తయారు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ పి.పావని మధు, ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఏబీసీ అకడమిక్ డైరెక్టర్ ఏరమాదేవి, డిగ్రీ కోఆర్డినేటర్ కె.సాయిరాం చౌదరి తదితరులు పాల్గొన్నారు.


10వ తరగతి బిట్ బ్యాంక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

రామచంద్రపురం: ట్రాఫిక్ నియంత్రణకు నియమ నిబంధనలు విధిగా పాటించాలని రామచంద్రపురం సీఐ వి.దుర్గారావు విద్యార్థులకు సూచించారు. చైతన్య టెక్నో స్కూల్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులుకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ దుర్గారావు పాల్గొని అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఎడమ వైపున మాత్రమే నడవాలని, రోడ్డు దాటే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, ట్రిపుల్ డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో హెల్మెట్ లేని వారికి పుష్పాలు అందజేసి, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం వైఎస్ఎస్ శ్రీనివాస్, రీజినల్ ఇంచార్జ్ ఎం.లక్ష్మినరేష్, కోఆర్డినేటర్ కిరణ్‌పాండే పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ దుర్గారావు

నేడు షిరిడీ సాయి మహాస్థూపం ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం హసన్‌బాదలో నిర్మించిన 130 అడుగుల షిరిడీ సాయి మహా స్థూపం ఆదివారం ఉదయం 10.50 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఉదయం 4 గంటల నుంచి భక్తుల చేతుల మీదుగా పది కోట్ల ×శ్రీసాయి៖ నామములు గల సాయికోటి పుస్తకాలను ఈ మహా స్థూపంలో నిక్షిప్తం చేయనున్నారు. 4.30 గంటలకు షిరిడీ సాయి సేవాశ్రమముల వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు గురూజీ సత్సంగ ప్రసంగం, 5.15 గంటలకు బాబా కాకడ హారతి, 6 గంటలకు సుప్రభాతం, 7 గంటలకు అభిషేకాలు, 8 గంటలకు ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, 10 గంటలు సాయిసేవకుల సత్సంగ ప్రసంగాలు, 10.50 గంటలకు 70 అడుగుల మహాస్థూపంపై నిర్మించిన 60 అడుగుల షిరిడీ సాయి విగ్రహం ప్రజాంకిత ఆవిష్కరణ జరుగుతాని నిర్వాహకులు తెలిపారు.


హసన్‌బాదలో షిరిడీ సాయి మహాస్థూపం

కేశవస్వామికి లక్ష తులసి పూజ

కాజులూరు: కోలంక శ్రీదేవి, భూదేవీ సమేత కేశవస్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి పూజ, కుంకుమార్చన ఘనంగా జరిగాయి. ఆలయ పురోహితులు ఖండవిల్లి శ్రీనివాసచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక పీఏసీఎస్ చైర్మన్ వత్సవాయి రామకృష్ణరాజు, క్షత్రియ పరిషత్ సభ్యులు దాట్ల విజయగోపాలరాజు, దాట్లబుచ్చిబాబురాజు, డి.లక్ష్మీపతిరాజు, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కేశవస్వామి ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న పురోహితులు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కాజులూరు: నూతన సంవత్సర వేడుకలలో భాగంగా గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం పోలీస్టేషన్ ఎస్ఐ ఎస్.తులసీరామ్ అన్నారు. ఈ మేరకు శనివారం పోలీసులు మండల గ్రామాల్లో పర్యటించి యువతకు పలు సూచనలు చేశారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్డు ప్రక్కల కేక్ కటింగ్‌లు బాణాసంచా కాల్చడం చేయకూడదన్నారు. మద్యం సేవించి యువత కేరింతలు కొడుతూ బైక్‌లపై తిరగరాదన్నారు.

శ్రీవారికి శాంతి కల్యాణం

రాయవరం: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి శ్రీవారికి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు అంగర అయ్యమాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు వైఖానస ఆగమ విధానంలో కల్యాణం నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో శ్రీవారికి దేవేరిలకు భక్తుల గోవిందనామస్మరణ నడుమ వైభవంగా జరిగిన కల్యాణానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉదయం ఆలయ ఆవరణలో దశావతారాలైన వటపత్రసాయి, మత్స్య, కూర్మ, వరాహ, నరశింహ, వామన, కల్కి, పరుశరామ, రామ, జగన్మోహిని, బుద్ధ, విశ్వరూపావతారాల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక వాహనంపై దశావతారాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రాయవరంలో దశావతారాల ఊరేగింపు

ముంగిట ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం

రామచంద్రపురం రూరల్: నూతన సంవత్సరం 2023కు స్వాగతం పలుకుతూ శనివారం మహిళలు ఇంటి ముంగిట ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. చిన్నారులూ సందడిగా ముగ్గులు వేయడంలో తల్లులతో పోటీ పడ్డారు. రంగు రంగుల అందాల హరివిల్లులతో గ్రామాల్లోనూ, రామచంద్రపురం పట్టణంలోను నూతన సంవత్సర సందడి నెలకొంది.

పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు


ఆయాలకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఫణికృష్ణారెడ్డి, హెచ్ఎం అప్పారావులు

రాయవరం: స్థానిక నంబరు-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నూతన సంవత్సర ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం గుంటూరు అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న విద్యా పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యాపరంగా రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం అప్పారావు సౌజన్యంతో పాఠశాల ఆయాలకు నూతన వస్త్రాలను, స్వీట్స్ ప్యాకెట్లను ఫణికృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

రూ.79 లక్షలతో అభివృద్ధి పనులు


వాకతిప్ప ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల స్లాబ్ నిర్మాణ పనులు

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రూ.79 లక్షలు మంజూరయ్యాయని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పిల్లి శ్రీనివాస్ అన్నారు. నాడు-నేడు నిధులు రూ.10.71 లక్షలతో జరుగుతున్న మరుగుదొడ్ల స్లాబ్ నిర్మాణ పనుల్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లతో పాటు రూ.37 లక్షలతో మూడు అదనపు తరగతి గదులను, మిగిలిన నిధులతో మేజర్, మైనర్ మరమ్మతుల పనులు చేపడుతున్నామని చెప్పారు.

కనువిందు చేస్తున్న మంచు దుప్పటి


అముజూరులో ఉదయం 8 గంటలకు కురుస్తున్న మంచు

కె.గంగవరం: రోజురోజుకి చలి పెరిగిపోతోంది. సాయంత్రం ఐదు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మంచు దుప్పటిలా అల్లుకుంటుంది. పచ్చని పంట పొలాల మధ్య, కొబ్బరి చెట్ల మీద ఉన్న మంచు చూపరులకు కనువిందు చేస్తుంది. ఉదయాన్నే మంచు కురవడం వల్ల వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణాలు చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు.

మడిలో కర్షకుడు.. పశ్చిమ ఒడిలో సూరీడు


భానుడి పడమటి సంధ్యారాగం

రాయవరం: ప్రపంచానికే వెలుగులను పంచే సూరీడు చిరుదీపంగా పశ్చిమాన ఒదిగి పోతూ.. తన ప్రతిబింబాన్ని అద్దంలా ఉన్న పుడమితల్లిలో చూసుకుంటూ మురిసిపోతున్నాడు. మరోపక్క రైతన్న ప్రపంచానికి పట్టెడన్నం అందించేందుకు మడిలో విత్తనాలు చల్లుతున్నాడు. ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టి పడేసింది. సాయం సమయంలో భానుడి పడమటి సంధ్యారాగం పాడుతున్న వేళ.. 'సాక్షి' కెమెరాకు చిక్కిన నయన మనోహర దృశ్యమిది.

కోటి ఆశలతో.. కొంగొత్త సంవత్సరానికి ఆహ్వానం

- కళకళలాడిన బేకరీలు, హోటల్స్
- సామాజిక మాధ్యమాల ద్వారానే శుభాకాంక్షలు
- రంగవల్లులతో నిండిన వీధులు



మండపేటలో అమ్మకానికి ఉంచిన ఫ్లవర్ బొకేలు

రాయవరం: కొత్త సంవత్సర వేళ సంబరాలు అంబరాన్నంటాయి. గత జ్ఞాపకాలను గుండెల్లో పదిలం చేసుకుని కోటి ఆశలతో 2023 సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ యువత కేరింతలు కొట్టారు. మండపేట, రామచంద్రపురం రెండు నియోజకవర్గాల్లోను గ్రామగ్రామాన న్యూఇయర్ సంబరాలు వేడుకగా జరిగాయి. శనివారం సాయంత్రం నుంచి ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులు పలకరించాయి. పలువురు తమ గృహాలు, వ్యాపార సంస్థలకు విద్యుద్దీపాలంకరణతో సోయగాలను అద్దారు.

వెలిసిన బిర్యానీ పాయింట్లు

పలు గ్రామాల్లో ప్రత్యేక బిర్యానీ పాయింట్లు వెలిశాయి. వినియోగదారులను ఆకర్షించేందుకు న్యూ ఇయర్ స్పెషల్ అంటూ వస్త్ర, స్వీట్స్, ఫ్యాన్సీ, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. రెస్టారెంట్లు, హోటళ్లల్లోనే కాకుండా ప్రత్యేకంగా టెంట్లు వేసి బిర్యానీ, చికెన్ ఫ్రైల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. బొకేలు, దండలతో పూల దుకాణాలు సందడిగా మారాయి. పట్టణంతో పాటు పల్లెల్లో సైతం పెద్ద ఎత్తున ఫ్లవర్ బొకేల అమ్మకాలు జరిగాయి.

సామాజిక మాధ్యమాల ద్వారా

గతంలో కీలక పాత్ర పోషించిన గ్రీటింగ్ కార్డులు దాదాపు కనుమరుగు కావడంతో ఇప్పుడు ఫేస్‌బుక్, వాట్సాప్‌ల ద్వారా గ్రీటింగ్స్ చెప్పుకున్నారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాత్రంతా బందోబస్తు నిర్వహించారు.



రాయవరంలో ఓ బేకరీలో నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమైన కేకలు

మరింత మంచిగా పాలన

రామచంద్రపురం: 2023 నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్న వేళ ప్రజలకు మరింత మంచి చేయాలనే తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారు. ఆయన ఆదేశానుసారం రాష్ట్రంతో పాటు నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసేందుకు కృషి చేస్తాను. 2023 నూతన సంవత్సరంలో భగవంతుని ఆశీస్సులతో ప్రజలకు మరింత మేలు జరగాలని, మంచి చేయాలనే తపనతో ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి



టీడీపీది ఓర్వలేని తనం



దూడల చినబాబు

కె.గంగవరం: పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందుకుంటూ ప్రజలందరూ సంతోషంగా ఉంటే ప్రతిపక్ష టీడీపీ పార్టీ ఓర్వలేనితనంతో గ్రామాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు(చినబాబు) అన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అందిస్తూ పాలన సాగిస్తుంటే టీడీపీ నాయకులు కడుపు మంటతో అర్థంలేని ప్రచారం చేస్తున్నారన్నారు. నూతన సంవత్సరంలో చంద్రబాబుతో పాటు వారి నాయకులకు కూడా దేవుడు బుద్ధి ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు.

ప్రజలంతా సంతోషంగా జీవించాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో నూతన సంవత్సరంలో ఇంటింటా సుఖ సంతోషాలు వెల్లివిరిసి, ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు. ప్రజాశ్రేయస్సు కోసం తన శాయశక్తులా కృషి చేస్తున్నానని, కొత్త ఏడాదిలోను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు మరింతగా పని చేస్తానని వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో ముద్రించిన గ్రీటింగ్ కార్డులను నియోజకవర్గంలోని ప్రజలకు ఇంటింటికి వెళ్లి పార్టీ శ్రేణులు పంపిణీ చేస్తున్నారు. శనివారం ద్వారపూడిలో సర్పంచ్ ఈతకోటి కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, పార్టీ నాయకులు గ్రామంలో ప్రజలకు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని సూర్యకన్వెన్షన్‌లో ఆదివారం ఉదయం జరిగే నూతన సంవత్సరం వేడుకల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొంటారని పార్టీ కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు.



ద్వారపూడిలో గ్రీటింగ్ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు

ఇంటింటా ఆనందం వెల్లివిరియాలి

చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: 2023 సంవత్సరంలో ఇంటింటా ఆనందం వెల్లివిరియాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆకాంక్షించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం చైర్‌పర్సన్ దుర్గారాణి స్థానిక 14వ సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో 2022 సంవత్సరంలో పేదలందరికీ ఎంతో మేలు జరిగిందన్నారు. వలంటీర్లతో పాటు కొత్తగా తీసుకొచ్చిన సచివాలయ కన్వీనర్ల వ్యవస్థ ద్వారా 2023లో మరింత సమర్థవంతంగా పాలన సాగించేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మొండి భవాని, సచివాలయం అడ్మిన్ మాచరయ్య, పార్టీ నాయకులు పెంకే గంగాధర్, యాళ్ల శ్రీనివాస్, రెడ్డి రత్తయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి